క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

నకరికల్లు: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు సీడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జాబ్స్ రిసోర్స్ పర్సన్ వై.శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. నరసరావుపేట మండలం కోటప్పకొండలోని స్కిల్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఉచిత వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌పాస్ అయినవారు గాని డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 3 నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాలకు 9908482907 నంబరును సంప్రదించాలన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు నేటి వరకు గడువు

క్రోసూరు: పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించు పాలిసెట్-25 పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17 వరకు గడువు పెంచినట్లు క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్స్‌పాల్ బీవీ రమాదేవి బుధవారం తెలిపారు. కావున పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన, పరీక్షలు రాసి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామ ఎంపీయూపీ పాఠశాలలో 20 మంది ఎస్టీ పేద విద్యార్థులకు బుధవారం పాఠశాల ఉపాధ్యాయుడు మంటి సాంబశివరావు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, శివబాబు చేతులమీదుగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహాలక్ష్మి, హనుమంతరావు, ఎ.శ్యామల, మాధవి, ఓ.సుశీలతో పాటు గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడి తోటలను పరిశీలించిన హెచ్‌వో



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మామిడి తోటలను బుధవారం హార్టికల్చర్ అధికారి నవీన్‌కుమార్, రైతు సేవా కేంద్రం సహాయ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌వో మాట్లాడుతూ మామిడి సాగులో అధిక దిగుబడులు పొందేందుకు, పూత, కాయ దశలో చీడపీడల నుంచి ఎటువంటి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో రైతులకు తెలియజేసినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 240 ఎకరాల్లో మామిడి పంట సాగు చేస్తున్నారని తెలిపారు. వేకువజామున వచ్చిన భారీ గాలివానకు కాయ నష్టమేమి జరగలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హరికృష్ణ, కమల, ఎంపీఈఓ దివ్య, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

రాజుపాలెం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు నేటి నుంచి మే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఎస్సీలు 50 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

మోదీకి మారు పేరే ఈడీ

పీసీసీ ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్

సత్తెనపల్లి: మోదీకి మారు పేరే ఈడీ అని, మోదీ ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ (ఈడీ) అధికారాన్ని అడ్డం పెట్టుకొని నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై అక్రమంగా చార్జిషీట్ దాఖలు చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో జాతీయ ఉద్యమ వ్యాప్తికి నేషనల్ హెరాల్డ్‌ను స్థాపించారని, 5 వేల మంది షేర్ హోల్డర్స్‌తో అసోసియేట్ జర్నల్ ఆఫ్ ఇండియా ద్వారా నిర్వహించేవారన్నారు. పత్రిక నిర్వహణ భారమై మూసివేస్తున్న సందర్భంలో అగ్రనేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యంగ్ ఇండియా' ద్వారా రూ.90 కోట్లను అసోసియేట్ జర్నల్ ఆఫ్ ఇండియాకు ట్రాన్స్‌ఫర్ చేయడం జరిగిందన్నారు. దురుద్దేశంతో బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి చేసిన ప్రైవేట్ కంప్లైంట్ ఆధారంగా మోదీ డైరెక్షన్‌లో ఈడీను ప్రయోగించి మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి రాజకీయ వేధింపులకు గురి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీని, నాయకత్వాన్ని బలహీనపరచాలని చేస్తున్న కుట్రలను కార్యకర్తలు తిప్పికొట్టాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'సర్వే' భయాలు..

అయోమయంలో ప్రజలు

- 27 రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల పీ-4 సర్వే
- సంక్షేమ పథకాల్లో కోత కోసమే సర్వే అని ప్రజల అనుమానం
- ఇంట్లో వస్తువుల వివరాలన్నీ నమోదు



నెమలికల్లు గ్రామ సచివాలయం

అమరావతి: మీ ఇంట్లో ఫ్రిడ్జ్ ఉందా.. టీవీ ఉందా.. ఇంట్లో ఏసీ ఉందా, బైక్ ఉందా, మీ ఇంట్లో ఎన్ని స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. మీరు ప్రైవేటు జాబ్ చేస్తున్నారా.. మీకు జీతం ఎంతొస్తుంది.. తదితర ప్రశ్నలతో ప్రభుత్వం నిర్వహించే సర్వేపై ప్రజలలో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతుల అంచనా పేరుతో సంక్షేమ పథకాలకు కోత వేయడమే లక్ష్యంగా పీ-4 సర్వే సాగుతోందని పలు విమర్శలు ఉన్నాయి. కూటమి అధికారంలో వచ్చి 10 నెలలు దాటినా ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. సర్వేల పేరుతో కాలయాపన చేయడమే లక్ష్యంగా కొనసాగుతోంది. పీ-4 సర్వే ప్రజా సంక్షేమం కోసమా, ప్రభుత్వ పథకాల అమల్లో కోత పెట్టడం కోసమో అర్థంకాక ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారు. తాజాగా నిర్వహించిన పీ-4 సర్వేతో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు లేదా కొత్త పథకాల్లో కోత విధించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతుంది.

గృహోపకరణాల వివరాలు నమోదు

సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. మీ ఇంటిలో టీవీ, ఏసీ, ఫోర్ వీలర్, టూ వీలర్, ఇతర గృహోపకరణాలు ఇంకేమైనా ఉన్నాయా అంటూ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇల్లు రేకుల షెడ్డా, స్లాబా అంటూ ఇంటిని పరిశీలించి నమోదు చేస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలు కూడా సేకరించినట్లు సమాచారం. ఇలా 27 రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి నమోదు చేస్తున్నారు. సర్వే అనంతరం ప్రజల ఫోన్‌కు ఓటీపీ పంపి ఆ ఓటీపీ తెలుసుకుని యాప్‌లో నమోదు చేసి సర్వేను ముగిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో పేద కుటుంబాల వారు అప్పు చేసి నెలవారీ వాయిదాల్లో ఇళ్లల్లో వస్తువులను అమర్చుకుంటున్నారు. సచివాలయ సిబ్బంది సదరు వస్తువుల వివరాలు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు.

సర్వే వద్దన్నా నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్‌ఫోన్, బైక్ ఉన్నాయా లాంటి ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురి చేస్తోంది.

ఓటీపీ చెబితే అయిపోయినట్లే

ఇదే అదనుగా కొంత మంది ఉద్యోగులు లబ్ధిదారులకు ఫోన్ చేసి మేము సచివాలయం నుంచి సర్వే చేస్తున్నాం మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది వెంటనే చెప్పాలని అడుగుతున్నారు. చెప్పిన వెంటనే సర్వే అయిపోయిందంటున్నారు. మిగిలిన వివరాలన్ని వారే పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పేదల గుర్తింపు కోసమే

పీ-4 సర్వేలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కుటుంబాలను సర్వే చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివిధ రకాల సమాచారాన్ని సేకరించి యాప్లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఈ సర్వే ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపుకు దోహద పడుతుందని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యాథావిధిగా కొనసాగుతాయని, అందులో ఎలాంటి అపోహలొద్దని చెప్తున్నా క్షేత్రస్థాయిలో ప్రజలు మాత్రం నమ్మటం లేదు.

తగ్గించేందుకే సర్వే



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయలేకనే పీ-4 సర్వే అంటూ ప్రజలను అయోమయానికి గురి చేస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇటువంటి సర్వేలు నిర్వహించలేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. వచ్చి పది నెలలు దాటుతున్నా సంక్షేమ పథకాలను అమలు చేయలేదు.

– భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, అమరావతి

పథకాలకు దూరం చేసే పన్నాగం



పీ-4 సర్వే పేరిట ప్రస్తుత జీవనానికి అవసరమైన గృహోపకరణాల వివరాలు అడగటం పేదలను సంక్షేమ పథకాలకు దూరం చేసే పన్నాగం. సర్వే ఆధారంగా పథకాల్లో కోతలు విధిస్తే లబ్ధిదారులు నష్టపోవటంతో పాటు పేదవాడు మరింత పేదవాడైపోతాడు. ప్రభుత్వం ప్రజలకు కల్పించాల్సిన ఉపాధి, విద్యా, వైద్యం వంటి సౌకర్యాలను కల్పించకుండా తమ బాధ్యతను విస్మరిస్తుంది. పేదవాడిని ఆధునిక బానిసత్వంలోకి నెడుతుంది.

– బి.సూరిబాబు, మండల సీపీఎం కార్యదర్శి, అమరావతి

అడిగిన వారందరికీ పని చూపించాలి

ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు



పుట్లగూడెంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

అచ్చంపేట: ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.307 తగ్గకుండా అడిగిన వారందరికీ పని చూపించాలని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు ఉపాధి హామీ ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లుకు సూచించారు. మండలంలోని పుట్లగూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. మస్టర్ నిర్వహణ, పని ప్రాంతంలో కూలీలకు కల్పించే వసతులు, కూలీలకు కేటాయిస్తున్న పనులు, వాటి కొలతలు, ప్రథమ చికిత్స, మంచినీటి వసతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాలలో వలసల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో పనిలేదు అనడానికి వీలులేదని, అడిగిన ప్రతి కూలీకి పని చూపించాలన్నారు. ప్రతి కూలీకి కొలతలు చూపించి, చేయించాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిపై ఉందని చెప్పారు.

భావితరాలకు అంబేడ్కర్ ఆదర్శం

–రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ




మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రియదర్శిని

సత్తెనపల్లి: నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పట్టణ సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు పెన్షనర్ బాదుగున్నల కమలాకర్‌రావు స్పాన్సర్ చేసిన బహుమతులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నవభారత నిర్మాణంలో అంబేడ్కర్ పాత్ర విశేషమైందన్నారు. ప్రపంచానికే ఆదర్శనీయమైన రాజ్యాంగాన్ని రచించిన ఆయన అపర మేధావి అని కొనియాడారు. పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఎంతో గొప్ప దార్శనికుడని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం ప్రియదర్శిని మాట్లాడుతూ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని, ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చింతపల్లి వెంకటాద్రి, గద్దే మురహరి రావు, జెట్టి సైదులు, ఎల్ సుబ్బారావు, జోజిరెడ్డి, డాక్టర్ సరికొండ రమాదేవి మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అర్ధ సంవత్సర పరీక్షల్లో ప్రతి తరగతిలోనూ అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను జ్ఞాపికతో పాటు రూ.100 చొప్పున నగదు, ఒక పెన్ను బాదుగున్నల కమలాకర్‌రావు సహకారంతో అందించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే వైద్య శిబిరాలు

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు: నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రతి మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని సెయింట్ పాఠశాలలో బుధవారం కాటూరి హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తాం

వ్యవసాయాన్ని లాభసాటిగా చేస్తామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు చెక్కల గొర్రు, 11 చెక్కల గొర్రులు, విత్తనాల గొర్రులు, తైవాన్ స్ప్రేయర్‌లను అందించారు. పంటల దిగుబడిని పెంచేందుకు సబ్సిడీపై ప్రభుత్వం వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తుందన్నారు. ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పరికరాలపై ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి రైతులకు చేయూతనిస్తుందన్నారు.

క్రీడా వేదిక ప్రారంభం

పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక నేత ఆర్తిమళ్ల రమేష్ సతీమణి ఆర్తిమళ్ల నళిని స్మారకంగా ఏర్పాటు చేసిన క్రీడా వేదికను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం సంతోషమన్నారు. అనంతరం పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్తిమళ్ల రమేష్, సర్పంచ్ గుడిపూడి రాజు, భాష్యం ఆంజనేయులు, షేక్ ముంతాజ్, అంజిముల్లా, వడ్లమూడి అప్పారావు, తహసీల్దార్ ధనలక్ష్మి, ఎంపీడీవో సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మబాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహించటం జరుగుతుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వాటిని పరిశీలించారు. ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యల పరిష్కార దిశగా పని చేయాలని అధికారులకు సూచించారు.

సోలార్ లైట్స్ కొనుగోలుకు వితరణ



అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం గ్రామ పంచాయతీకి 15 సోలార్ వీధి లైట్స్ కొనుగోలు చేసేందుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ బుధవారం సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావుకు ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు చేతుల మీదుగా రూ.1.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధిలో స్నేహహస్తాలు ఫౌండేషన్ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. గ్రామంలో విద్యుత్ అంతరాయాలు లేకుండా ఉండేందుకు సోలార్ విద్యుత్ వీధి లైట్లు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వీటివల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో సోలార్ ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుందని, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని స్నేహహస్తాలు గ్రామాల అభివృద్ధికి ముందడుగు వేయడం మంచి పరిణామమన్నారు. గ్రామాభివృద్ధి సంఘ చైర్మన్ తుమ్మా శౌర్రెడ్డి, మొక్కపాటి గిరిబాబు, బత్తుల శ్రీనివాసరావు, స్నేహహస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు కందుకూరి



సత్తెనపల్లి: స్త్రీ విద్యను, వితంతు వివాహాలను ప్రోత్సహించి దురాచారాలను నిర్మూలించడంలో ప్రముఖ పాత్ర వహించిన వ్యక్తి, యువజన సంఘాల స్థాపన వీరేశలింగంతోనే ప్రారంభమైందని హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అన్నారు. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు పట్టణంలోని సాయికృష్ణ థియేటర్ ఎదురుగల టీచర్ మస్తాన్ ఐటీఐ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ సమాజ సేవ కోసం హితకారిణి సంస్థను స్థాపించి తన యావదాస్తిని దానికి అంకితం చేసిన మహనీయుడు, గొప్ప మానవతావాది వీరేశలింగం పంతులు అని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ స్త్రీలకు విద్య, స్వాతంత్ర్యం అనేవి కలగా ఉన్న రోజుల్లో వాటిని హక్కులుగా మార్చిన మహనీయుడు వీరేశలింగం అని కొనియాడారు. ముందుగా విరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెల్ప్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా తాగి జీవితాలు పాడుచేసుకోవద్దు

తహసీల్దారు శ్రీనివాసరావు



సంద్రతండాలో ప్లకార్డుల ప్రదర్శిస్తున్న ఎక్సైజ్, రెవెన్యూ సిబ్బంది



చేజర్లతండాలో నాటుసారాతో అనర్థాల పై ర్యాలీలో ఎక్సైజ్ శాఖ అధికారులు

అచ్చంపేట: నాటుసారి తాగి బంగారం లాంటి జీవితాలను పాడుచేసుకోవద్దని తహసీల్దారు జి.శ్రీనివాసరావు తెలిపారు. నవోదయం 2.0లో భాగంగా మండలంలోని తాడువాయి పంచాయతీ పరిధి సంద్రతండా, బంగారుతండాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లకార్డుల ప్రదర్శన చేశారు. నాటుసారా వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. అలానే రహస్య స్థావరాలలో నాటుసారా బట్టీలు పెట్టి సారా కాయడం వల్ల జైలు పాలు కావలసి వస్తుందని హెచ్చరించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ టి.తులసి మాట్లాడుతూ నాటుసారా కాస్తూ, విక్రయిస్తూ పట్టుబడితే జీవితాంతం కుటుంబాలకు దూరంగా, జైలు పాలవ్వాల్సి వస్తుందని, కుటుంబ పోషణకు సన్మార్గాలను ఎంచుకోవాలని హిత బోధ చేశారు. నాటుసారా తాగితే అధోగతి పాలవ్వక తప్పదన్నారు. ప్రతి ఒక్కరు పురోగతివైపు పయనించాలని, ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచుకోవాలని చెప్పారు. అనంతరం తండావాసులచేత సారా తయారు చేయం, విక్రయించం, తాగం, మంచి పౌరులుగా జీవిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అచ్చంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారాతో అనర్థాలు తెచ్చుకోవద్దు

నకరికల్లు: నాటుసారా ఆరోగ్యానికి హానికరమని, సారాకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ రెడ్డి అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేజర్ల తండాలో నాటుసారాతో అనర్థాలపై ర్యాలీ చేపట్టి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా సంబంధిత నేరాలకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. యువత చెడుమార్గంలో వెళ్లకుండా జీవితాన్ని సక్రమంగా మలచుకోవాలని అన్నారు. సారా సంబంధిత నేరాలకు దూరంగా ఉన్నవారికి నిబంధనల మేరకు పునరావాసం కల్పిస్తామన్నారు. ఎంజీఆర్‌పీ కార్యక్రమం కింద 100 రోజులు పని కల్పించబడుతుందన్నారు. గ్రామస్తులతో నవోదయం ప్రతిజ్ఞ చేయించారు. నాటుసారా రవాణా, తయారీ, అమ్మకాలు సమాచారాన్ని 14405 టోల్‌ఫ్రీ నంబరుకు అందించాలని కోరారు. ఎక్సైజ్ శాఖ సూపరింటిండెంట్ కె.మణికంఠ, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ, సీఐ కె.సోమయ్య, ఎస్ఐలు మురళి, తారాలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానపరిచిన నిందితులను అరెస్ట్ చేయాలి: గార్లపాటి దాను

క్రోసూరు: కాకినాడ జిల్లా శంఖవరం ఎస్సీ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానపరిచిన వారిని గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి రోజునే ఇలాంటి సంఘటన జరగటం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్‌ను, ప్రజలను అవమానించటమేనని గార్లపాటి దాసు అన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. అంతే కాకుండా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు ఎదురుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే విగ్రహాలకు రక్షణ కల్పించిన వారవుతారని దాసు అన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రీసర్వే



మాట్లాడుతున్న తహశీల్దారు శ్రీనివాసరావు



గుడిపూడిలో రెండో విడత రీ సర్వేపై ర్యాలీలో తహసీల్దార్ చక్రవర్తి

అచ్చంపేట: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. మండలంలోని పెదపాలెంలో మంగళవారం సాయంత్రం జరిగిన గ్రామ సభలో ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు. భూములు కలిగిన రైతులంతా తమ భూములకు సంబంధించిన పత్రాల ద్వారా సమస్యలను పరిష్కరించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. జిల్లా, మండల సర్వేయర్లు గ్రామంలోని ప్రతి సర్వే నంబరులోని భూమిని పరిశీలించి, కొలిచి హద్దులు వేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రముఖులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు షేక్ జానీబాషా, సర్వేయర్ యు.ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ నెల్లూరి హరిబాబు, రైతు ప్రతినిధులు నెల్లూరి శ్రీనివాసరావు, బొంతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి

ముప్పాళ్ళ: రెండవ విడత రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వేపై వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. రెండవ విడత సర్వేలో భాగంగా గోళ్ళపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రారంభమైందని, సర్వే కోసం అదనపు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. యడ్లపాడు, నాదెండ్ల మండలాల నుంచి నాలుగు బృందాలు సర్వేలో పాల్గొంటాయన్నారు. స్థానిక సిబ్బంది సమన్వయంతో సర్వేను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ అంజనేయులు, మండల సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే

సత్తెనపల్లి: బ్రిటీష్ కాలంలో చేపట్టిన భూ సర్వేను తిరిగి సుమారు 115 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీ సర్వే చేపట్టడం జరిగిందని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి అన్నారు. మండలంలోని గుడిపూడి గ్రామంలో రెండో విడత రీ సర్వేలో భాగంగా బుధవారం భూమి పూజ చేసి ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చక్రవర్తి మాట్లాడుతూ భూ వివాదాల పూర్తి ప్రక్షాళనకు రీ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు హక్కు పత్రాలతో వారి సర్వే నంబర్లలో సర్వే జరుగుతున్నప్పుడు హాజరై భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. గ్రామ సభలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎస్.రవికుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.బోసుబాబు, మండల సర్వేయర్ విజయ్, గ్రామ సర్పంచ్ టి.తిరుపతిరావు, ఎంపీటీసీ మర్రి పూర్ణయ్య, నాయకులు లగడపాటి గజానన, గద్దె ఆంజనేయులు, కొనకంచి పుల్లారావు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుబ్బారావు, సిబ్బంది

సత్తెనపల్లి: వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, మండే స్వభావం కలిగిన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సత్తెనపల్లి అగ్నిమాపక అధికారి ఎంవీ సుబ్బారావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని విజయదుర్గా టవర్స్ అపార్ట్‌మెంట్‌లో బుధవారం అపార్ట్‌మెంట్ వాసులకు వంటింట్లో గ్యాస్ ఫైర్ అయినప్పుడు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలపై డెమో ద్వారా ప్రత్యక్షంగా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సుబ్బారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల సమయంలో అప్రమత్తత ముఖ్యమన్నారు. ప్రమాదం జరిగితే భయపడటం, ఆందోళన చెందకుండా ప్రమాదాల నివారణపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు లీకుల వల్ల కలిగే ప్రమాదాలను ఎలా నివారించాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎస్కే గౌస్, డ్రైవర్ ఆపరేటర్ డి.విజయభాస్కర్ రెడ్డి, ఫైర్ మాన్లు వై.మహేంద్రారెడ్డి, ఎస్.రమణ నాయక్, పి.గోవిందు, బి.నాగేశ్వరరావు, ఎస్కే సుభాని పాల్గొన్నారు.